అడుగుకో గొయ్యి.. గజానికో గుంత

ఛిద్రమైన రోడ్లు

రాకపోకలకు అవస్థలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68, 69వ వార్డుల్లోని పలు రహదారులు గోతుల మయంగా మారాయి. ఆ రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అడుగుకో గుంత.. గజానికో గొయ్యి ఉండడంతో రాకపోకలకు నరకం చూస్తున్నారు. గోతుల వల్ల ఒళ్లు హూనం కావడంతో పాటు వాహనాలు దెబ్బతింటున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. కనీసం ప్యాచ్ వర్క్‌లైనా చేయాలని కోరుతున్నారు.

- జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం పిండి మిల్లు వద్ద డెయిరీ కాలనీకు వెళ్లే మలుపులో రోడ్డు ప్రమాదకరంగా మారింది. గొయ్యి ఉండడంతో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.
- జీవీఎంసీ 69వ వార్డు భెల్ టౌన్ షిప్ గేటు నుంచి సర్వీసు రోడ్డు మధ్యలో రోడ్డు గోతుల మయంగా మారింది. ఈ ప్రాంతంలో సిగ్నల్ పాయింట్ ఉండటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సర్వీసు రోడ్డు నుంచి గేటు వరకు జీవీఎంసీ పనులు చేపట్టాల్సి ఉంది. గేటు లోపల గోతుల మయంగా ఉన్న రోడ్డును భెల్ సంస్థ అభివృద్ధి చేయాలి.
- 68వ వార్డు రాంనగర్ నుంచి మింది వెళ్లే రోడ్డును ఇటీవలే అభివృద్ధి చేసినా రోడ్డు ఛిద్రమైంది. మలుపుతో పాటు రోడ్డు మీద భారీగా గోతులు తేలి ప్రమాదకరంగా మారింది. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్న ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు.
- వేంకటేశ్వరకాలనీకి వెళ్లే వైపు మహేంద్ర షోరూం ఎదురుగా సర్వీసు రోడ్డుపై గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బందుల నడుమ రాకపోకలు సాగిస్తున్నారు. వీటితో కాకుండా పలు చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి.

నామరూపాల్లేని రహదారులు

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్ వుడా ఫేజ్–1 కాలనీలో రహదారులు నామరూపాల్లేకుండా నాశనమయ్యాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఎల్‌ఐజీ 68 నుంచి ప్రారంభమయ్యే వీధిలో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రహదారులను పునర్నిర్మించాలని కాలనీ అసోసియేషన్ ఫిర్యాదు చేసినా కనీసం మరమ్మతులు చేపట్టడానికి కూడా అధికారులు ముందుకు రాకపోవడంపై కాలనీవాసులు మండిపడుతున్నారు.


అక్కిరెడ్డిపాలెం పిండి మిల్లు పక్కన ప్రమాదకరంగా రోడ్డు


రాంనగర్- మింది మధ్యలో రోడ్డు ఇలా..


వుడా ఫేజ్-1 కాలనీలో నామరూపాల్లేకుండా మారిన రహదారి


భెల్ సిగ్నల్ పాయింట్ టౌన్ షిప్‌లో గోతుల మయంగా రోడ్డు

రోడ్లు అధ్వానంగా ఉన్నాయి



జీవీఎంసీ 69వ వార్డులో ఎక్కడికక్కడే రోడ్లు ఛిద్రమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లు గోతులు తేలి ప్రమాదకరంగా మారాయి. షీలానగర్ వేంకటేశ్వరకాలనీ వద్ద సర్వీసు రోడ్డు అధ్వానంగా మారడంతో పాటు భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ఇబ్బందికరంగా ఉంది. వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించాలి.

– గోపిశెట్టి సన్యాసిరావు, నాతయ్యపాలెం

అవస్థల మధ్య రాకపోకలు



భెల్ సిగ్నల్ పాయింట్ నుంచి టౌన్ షిప్‌లోకి వెళ్లే రోడ్డు గోతులు తేలి ఉంది. రాత్రి సమయంలో గుంతలు గుర్తించలేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిత్యం ఆటోనగర్‌కు విధులకు వెళ్లే సమయంలో ఇబ్బందులకు గురవుతున్నాను. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

-భాస్కరరావు, ఆటోనగర్

క్లుప్తంగా

సాంకేతికతలో పట్టు సాధించాలి


విద్యార్థులతో చిట్‌చాట్ చేస్తున్న ఆద్విసోరి గ్రూప్ సభ్యుడు సంజయ్ ఖందూజా

అగనంపూడి: సాంకేతికలో వస్తున్న వినూత్నమైన మార్పులపై పట్టు సాధించడం ద్వారా అపార అవకాశాలను అందిపుచ్చుకోవచ్చునని ఆద్విసోరి గ్రూప్ ప్రతినిధి సంజయ్ ఖందూజా అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఇండస్ట్రీ సర్టిఫికేషన్, కెరియర్ అవకాశాలపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ, మెషిన్ లెర్నింగ్, బ్లాక్ చైన్, ఐవోటీ, రోబోటిక్స్ వంటి సాంకేతికలను సప్లై చేసి చైన్ల ప్రక్రియలు ఎలా మార్పు చెందుతున్నాయో వివరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, డీన్ బోడే ప్రసాద్, ఎంబీఏ హెడ్ బి.చంద్ర పాల్గొన్నారు.

పోర్టులో ఎకానమిక్ గ్రాబ్ షిప్ క్రేన్లు ప్రారంభం


ఎకానమిక్ గ్రాబ్ షిప్ క్రేన్లను ప్రారంభిస్తున్న అధికారులు, సిబ్బంది

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో రెండు అత్యాధునిక ఎకానమిక్ గ్రాబ్ షిప్ క్రేన్లను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగవరం పోర్టు ప్రతినిధులు మాట్లాడుతూ గంగవరం పోర్టులో లోడింగ్, అన్‌లోడింగ్ చేయడానికి అత్యాధునిక ఎలక్ట్రిక్ క్రేన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. వీటి ద్వారా కార్గో హ్యాండ్లింగ్ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించనున్నామని చెప్పారు. అలాగే వినియోగదారులకు సకాలంలో సేవలందించేందుకు ఈ క్రేన్లు దోహదం చేస్తాయని వివరించారు.

శివలింగాలకు పూజలు


కుసుమ హరనాథ ఆశ్రమంలో పూజలు చేస్తున్న భక్తులు

అగనంపూడి: ప్రవాస భారతీయుడి సంకల్పంలో భాగంగా కాశీలో కోటిలింగార్చన కార్యక్రమం కోసం 86వ వార్డు దువ్వాడ కుసుమ హరనాథ ఆశ్రమంలో భక్తులు 30 వేల శివలింగాలను తయారు చేశారు. ఈ మేరకు బుధవారం శివలింగాలకు పూజలు నిర్వహించారు. దువ్వాడ, రాజీవ్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని భక్తులు, భజన బృందాలు బంకమట్టి, సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన విగ్రహాలను ప్యాకింగ్‌చేసి కాశీకి పంపించే ప్రక్రియ చేపట్టారు. మహిళా బృంద ప్రతినిధి అన్నపూర్ణ, టి.రాము, బి.సత్యనారాయణ, బి.వి.బాలాజీ, అప్పారావు, ఉషశ్రీ, సుజాత, శ్రీలక్ష్మి, శారద పాల్గొన్నారు.

సంజీవరెడ్డి దృష్టికి ఉక్కు కార్మికుల సమస్యలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలను ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి దృష్టికి స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు తీసుకెళ్లారు. హైదరాబాద్‌లోని నివాసంలో బుధవారం సంజీవరెడ్డిని కలిసి కార్మికులకు మూడు నెలలుగా సక్రమంగా జీతాలు చెల్లించలేదని, కాంట్రాక్ట్ కార్మికులకు ఆర్నెల్లుగా జీతాలు ఇవ్వలేదని తెలిపారు. కనీసం ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారన్నారు.రిటైర్ అయిన కార్మికులకు పూర్తి సెటిల్‌మెంట్లు చేయలేదని, పీఎఫ్, ఎస్‌బీఎఫ్‌లు కట్టడం లేదన్నారు. త్రిఫ్ట్ సొసైటీ రికవరీలు చెల్లించక పోవడంతో కార్మికులు వడ్డీలు చెల్లించలేక సతమతవుతున్నారన్నారు. దీనిపై సంజీవరెడ్డి మాట్లాడుతూ సమస్యలపై కేంద్ర ఉక్కు మంత్రితో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కేంద్ర ఉక్కు మంత్రి ద్వంద్వ వైఖరి

- స్టీల్‌ప్లాంట్‌లో ప్రైవేటీకరణ లేదన్నారు.. పార్లమెంట్‌లో ఉందన్నారు
- బయట పడిన కేంద్ర ప్రభుత్వ వక్రబుద్ధి



ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర ఉక్కుమంత్రి కుమారస్వామి భిన్న ప్రకటనలతో కేంద్ర ప్రభుత్వ వక్రబుద్ధి మరోసారి బయటపడింది. స్టీల్‌ప్లాంట్‌లో పర్యటించిన సమయంలో ప్రైవేటీకరణ జరగదని చెప్పిన కుమారస్వామి పార్లమెంట్ సాక్షిగా ప్రైవేటీకరణ ప్రక్రియ కొనసాగుతుందని ప్రకటించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని కూటమి నేతల నిజస్వరూపం బహిర్గతం చేసింది. లోకసభ సభ్యుడు కీర్తి ఆజాద్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి కుమారస్వామి సమాధానం ఇస్తూ.. స్టీల్‌ప్లాంట్‌లో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి లావాదేవీలు కొనసాగుతున్నాయని ప్రకటించడం ఉక్కు వర్గాలను నివ్వెరపరిచింది. సాధారణ ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోలేక పోయిందని, తాము అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణ కాకుండా చూస్తామని హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి నేతలు.. ఇప్పుడు స్టీల్‌ప్లాంట్‌ను నిలువునా ముంచేశారు. ఇటీవల స్టీల్‌ప్లాంట్‌లో పర్యటించిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి అబ్బే ప్రైవేటీకరణ అంశమే లేదని ప్రకటించారు. రెండు నెలల సమయం ఇస్తే స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకునే విధంగా చేస్తామని ప్రకటించారు. అయన వచ్చి వెళ్లిన దగ్గర నుంచి స్టీల్‌ప్లాంట్ పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. ముడి పదార్థాల కొరత సృష్టించి ఒక బ్లాస్ట్‌ఫర్నేస్ నడిచేలా చేశారు. ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వకుండా, ఉన్న సదుపాయాలకు కోత వేయడం ద్వారా తీవ్ర ఆర్థిక ఇబ్బందులోకి నెట్టి.. వారిని మానసికంగా దెబ్బతీస్తున్నారు. ఆదుకుంటామని ప్రకటన చేసి రూ.1,650 కోట్లు ఇచ్చారు. వాటితో ముడి పదార్థాల కొనుగోలు, జీఎస్టీ చెల్లింపు, బ్యాంకులకు చెల్లింపు ద్వారా ప్రభుత్వం ఆ మొత్తాన్ని తిరిగి తీసేసుకుంది.

కాగా.. రాష్ట్రంలోని కూటమి నేతలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిపోయిందంటూ పెద్ద ఎత్తున ప్రకటనలు చేస్తున్నారు. విశాఖ ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రతీ సమావేశంలో ఇదే చెబుతూ మభ్యపెడుతున్నారు. ఇటీవల జరిగిన శాసనమండలి సమావేశాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయనివ్వబోమని ప్రకటించారు. ఒకవైపు చాపకింద నీరులా ప్రైవేటీకరణ పనులు కొనసాగుతుండగా..మరోవైపు ఆదుకుంటున్నట్టు ఇచ్చే బిల్డప్‌లు కూటమి నాయకుల మైండ్ గేమ్‌గా ప్రజలు భావిస్తున్నారు.

టీడీపీ సభ్యత్వం చేయించాలని ఆర్పీలపై ఒత్తిడి!

అక్కిరెడ్డిపాలెం: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టీడీపీ నాయకుల ఆగడాలకు అంతులేకుండా పోతున్నాయి. తాజాగా జీవీఎంసీ 68వ వార్డులో ఓ టీడీపీ నాయకురాలి తీరుపై డ్వాక్రా సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని ఆమె అతి చేస్తున్నారని మండిపడుతున్నారు. వార్డులో ఏడుగురు ఆర్పీలు ఉన్నారు. సీవో ద్వారా సదరు మహిళా నాయకురాలు ఆర్పీలపై ఒత్తిడి తెచ్చి ఆర్పీల పరిధిలో ఉన్న డ్వాక్రా గ్రూపు సభ్యులచే టీడీపీ సభ్యత్వం చేయించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సీవో ఆర్పీలతో బుధవారం సమావేశానికి ఆహ్వానించారు. అయితే విషయం తెలుసుకున్న మెజార్టీ ఆర్పీలు డుమ్మాకొట్టినట్టు సమాచారం. సీవోకు సదరు టీడీపీ నాయకురాలి అండ పుష్కలంగా ఉండటంతో ఆమె ఆర్పీలపై ఒత్తిడి తెస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

ఎమ్మెల్యే దృష్టికి విషయం!

ఈ తతంగాన్ని కొందరు ఆర్పీలు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు సమాచారం. అయితే డ్వాక్రా సంఘాల సభ్యులు మాత్రం మేము ఏపార్టీలో కూడా సభ్యత్వం తీసుకోమని, కావాలంటే సభ్యత్వ రుసుము రూ.100 వాళ్లే కట్టుకుని స్లిప్పులపై పేర్లు రాసుకోవాలని చెబుతామంటున్నారు.

బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలి

స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్


ఉక్కు అడ్మిన్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు మూడు నెలలుగా బకాయి పడ్డ 185 శాతం జీతాలు వెంటనే చెల్లించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఉక్కు పరిపాలన భవనం కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌పై తన వైఖరిని మార్చుకోలేదని పార్లమెంట్ సాక్షిగా రుజువైందన్నారు. అయినప్పటికీ తెలుగు రాష్ట్రాల ఎంపీలు ప్రశ్నించకపోవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోతే దోషులుగా మారక తప్పదన్నారు. ప్లాంట్ పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయడానికి అవసరమైన చర్యలు కేంద్రం చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ప్రధానకార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ యాజమాన్యం ఫిబ్రవరి నుంచి వేతనాలపై ఆంక్షలు విధిస్తూ మనోవేదనకు గురి చేస్తుందన్నారు. అధ్యక్షులు వై.టి.దాస్, నాయకులు కె. గంగాధర్, కృష్ణమూర్తి, మరిడయ్య, బి. అప్పారావు, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై చర్చ


భోపాల్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జిల్లా నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భోపాల్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా భెల్ యూనిట్ల సమావేశంలో భెల్ (హెచ్‌పీవీపీ) విశాఖపట్నం యూనిట్ సీటు నాయకులు కె.విజయ్ కుమార్, కె.నారపురెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో భెల్ జేఎస్‌సీ సభ్యులు, అఖిలభారత సీటు ప్రధానకార్యదర్శి తపన్ సేన్ హాజరయ్యారని తెలిపారు. సమావేశంలో పలు కార్మికుల సమస్యలపై చర్చించినట్టు వెల్లడించారు.

దివ్యాంగులమని దిగులు వద్దు

ఎంఈవో రమణాజీ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో రమణాజీ, హెచ్‌ఎం శ్రీనివాస్

పెదగంట్యాడ: దివ్యాంగులమని దిగులు పడవద్దు.. వైకల్యం శరీరానికే.. మనసుకు కాదని ఎంఈవో కంకటాల రమణాజీ ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని స్థానిక భవిత కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాల గల పిల్లలకు వివిధ ఆటలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వైకల్యం అనేది మనిషికి మాత్రమేనని మనసుకు కాదని అన్నారు. అంగవైకల్యం ఉన్న వారికి మేథోశక్తి బాగా ఉంటుందని చెప్పారు. జీవితంలో ఎదిగేందుకు అంగవైకల్యం అడ్డుకాదని, ఆత్మస్థైర్యంతో ముందు వెళ్తే అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. అనంతరం భవిత కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తున్న దివ్యాంగులైన నూకరాజు, నవీన్‌రెడ్డి, జీలకర్ర రమణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ సూర్యనారాయణ జీలకర్ర భువనేశ్వరి, లతశ్రీ, ఉపాధ్యాయులు రవి, శేఖర్, మనోహర్, కిల్లాన ముసలయ్య పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన ప్రత్యేక అవసరాల గల పిల్లలు, తల్లిదండ్రులు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: పిట్టవానిపాలెం 11కేవీ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 6న శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పిట్టవానిపాలెం ఫీడర్ పరిధిలోని పిట్టవానిపాలెం, కేఎస్‌పాలెం, పెదపాలెం, చినపాలెం, అష్రఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం తప్పదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అక్కిరెడ్డిపాలెం: 33/11 కేవీ బీహెచ్‌పీవీ ఎస్ఎస్ పరిధిలో 11 కేవీ మింది ఫీడర్, 11 కేవీ గాజువాక ఫీడర్‌లలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ – 2 ఈఈ బి.కె. నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మింది, రాజీవ్‌నగర్, గిరిప్రసాద్ కాలనీ, రాంనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

వీఎంఆర్ మల్టీప్లెక్స్ ప్రారంభం


వీఎంఆర్ మల్టీప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి: అగనంపూడిలో మొట్ట మొదటి సారిగా నాలుగు సినిహాళ్ల ప్రారంభమయ్యాయి. అగనంపూడి జాతీయ రహదారికి సమీపంలో ఉక్కు జనరల్ ఆస్పత్రి రహదారిలో నిర్మించిన వీఎంఆర్ మల్టీప్లెక్స్‌ను అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అగనంపూడి నిర్వాసితకాలనీల చుట్టూ బహుళ అంతస్తులు, గేటెడ్ కమ్యూనిటీ సంస్కృతి రెట్టింపు అవ్వడంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, గౌతు శిరీష, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి, రౌతు శ్రీనివాసరావు, యజమానులు యార్లగెడ్డ వెంకన్న చౌదరి, మధుసూదనరావు, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాట మహోత్సవం


నాతయ్యపాలెం రామాలయం వద్ద రాట మహోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీ వల్లీదేవసేన సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకుని శనివారం కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త అక్కిరెడ్డి శ్రీరాములు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం నాతయ్యపాలెంలోని కోదండ రామాలయం వద్ద కల్యాణ రాట ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కుమారులు బాలభాస్కర శ్రీనివాసరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామస్థాయి రెవెన్యూ సదస్సులు

గాజువాక: మండలంలో ఈనెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు గ్రామస్థాయి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ టి.శ్రీవల్లి తెలిపారు. మండలంలోని 18 రెవెన్యూ వార్డుల్లో ఈ సదస్సులు ఆయా వార్డు సచివాలయాల్లో నిర్వహించనున్నామన్నారు. సదస్సులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. ఈ సదస్సుల్లో ప్రజలు రెవెన్యూ సంబంధిత సమస్యలను తెలియజేసి తగిన పరిష్కారాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమాల్లో తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. తొలి సదస్సును గాజువాక మండలంలోని అక్కిరెడ్డిపాలెం సచివాలయంలో నిర్వహించనున్నట్టు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి పెంపునకు సహకరించండి


సీజీఎం మహంతితో సమస్యలపై చర్చిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ఇప్పుడిప్పుడే ఊపందుకుంటుందని.. మరింత పెంచడానికి అందరూ సహకరించాలని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఆర్. మహంతి కోరారు. నూతన సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు బుధవారం ఆయన్ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం మరింత ఉత్పత్తి పెంచేందుకు సన్నాహాలు చేస్తుందని.. ఉత్పత్తి పెంచడానికి కార్మిక సంఘాలు, ఉద్యోగులు కలిసి రావాలని కోరారు. నాయకులు మాట్లాడుతూ జీతాలు చెల్లించక పోవడం వల్ల కార్మికులు మానసిక స్థైర్యం కోల్పోతున్నారన్నారు. వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దాలినాయుడు, నాయకులు పుల్లారావు, ఎన్నేటి రమణ, టి.వి. శంకరరావు, డి. మహేశ్వరరెడ్డి, జి. అప్పలరాజు, ఎంవీరావు, జి. నూకరాజు, రామ్మూర్తి, అప్పలరాజు, జోగన్న, జి. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మత్తు నిద్ర!



నిద్ర సుఖం ఎరగదంటారు. ఈ ఫొటోలో ఉన్న వ్యక్తిని చూస్తే అది నిజమే అనిపిస్తుంది. హృదయ విదారకంగా అనిపిస్తున్న ఈ సన్నివేశం స్థానిక చినగంట్యాడ నాయుడోరు వీధివద్ద గల డస్ట్‌బిన్ వద్ద కనిపించింది. మత్తుగా నిద్రపోతున్న ఆ వ్యక్తిని చూసిన వారికి మనస్సు చివుక్కుమంది. డస్ట్‌బిన్ వద్ద చుట్టూ చేరిన పందుల గుంపు మధ్య అతడు ఒళ్లు మరిచి నిద్రపోవడాన్ని చూసినవారందరూ అయ్యో అనుకున్నారు. చిత్తు కాగితాలు ఏరుకొనే వ్యక్తి తాను తెచ్చుకున్న బ్యాగులను కింద వేసుకొని ఆ డస్ట్‌బిన్ వద్ద హాయిగా నిద్రపోతున్నాడు. అతడిని చూసి ఒళ్లు అలసి నిద్రపోతున్నాడని కొందరంటే, మత్తు ఎక్కువై నిద్రపోతున్నాడని మరికొందరు వ్యాఖ్యానించారు.

– గాజువాక